

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ
గోదావరి జిల్లా

బుధవారం,30 జులై 2025

8 పేజీలు


## పీ4లో మార్గదర్శులు స్వచ్ఛందంగా పాల్గొనేలా చర్యలు

- ఆగష్టు,1వ తేదీన సామాజిక పెన్షన్లను పకడ్బందీగా పంపిణీ చేయాలి
- అధికారులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి టెలి కాన్ఫరెన్స్



**ఏలూరు,మేజర్‌న్యూస్:** పీ4కార్యక్రమంలో మార్గదర్శులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా స్వచ్ఛందంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.పీ4 కార్యక్రమం, సామజిక పెన్షన్ల పంపిణీపై మంగళ వారం సాయంత్రం జిల్లాఅధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పీ4 కార్యక్రమంలో మార్గ దర్శకుల నమోదు కార్యక్రమం వేగవంతం చేయాల న్నారు. ముందుగా మండల పరిధిలో పీ4 కార్యక్ర మంలో బంగారు కుటుంబాలకు చేయూత ఇచ్చేందు కు మార్గదర్శులుగా ఉండే పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల వారిని గుర్తించి, వారికి పీ4 కార్యక్రమం సదుద్దేశ్యంను వివరించాలన్నారు. మార్గదర్శులుగా గుర్తించిన వారిని పీ4 వెబ్సైట్ నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా మార్గదర్శులు దత్తత తీసుకునే బంగారు కుటుంబాల వివరాలు కూడా ఆన్లైన్‌లో నమోదు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆగష్టు, 1వ తేదీన సామజిక పెన్షన్ పంపిణీని లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి అందించాలన్నారు.పెన్షన్ పంపిణీ చేసే సిబ్బంది లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించేలా చూడాలన్నారు.జిల్లాలో కొత్తగా మంజూరైన సామజిక పెన్షన్ల వివరాలను స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు.టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా ముఖ్యప్రణాళికాధికారి వాసుదేవరావు, డిఆర్డిఏ పీడీ ఆర్. విజయరాజు,డిఈఓ వెంకటలక్ష్మమ్మ, వ్యవసా యాధికారి హబీబ్ భాషా , ఎంపిడిఓ లు, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డ్వాక్రా గ్రూప్‌లకు తక్కువ రుణాలు మంజూరుపై కలెక్టర్ ఆగ్రహం ..

- చేనేత కార్మికులు ముద్ర రుణాలు మంజూరులో తాత్సారం ఎందుకు ?
- సి.సి.ఆర్సి కార్డులు కలిగిన కౌలు రైతులకు బ్యాంకర్లు సహకరించాలి



**భీమవరం,మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టరేట్ పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం అండ్ జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం (బ్యాంకర్ల సమావేశం) జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలులో బ్యాంకర్ల పాత్ర కీలకమ న్నారు. పథకాల లక్ష్యసాధనకు బ్యాంకర్లు తమవంతు సహకారం అందిచాలన్నారు. ముఖ్యంగా అర్హత కలిగిన కౌలు రైతులందరికీ రుణాలు అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్‌హెచ్‌జిలకు రుణాల మంజూరు లక్ష్యంలో చాలా లోటు కనిపిస్తుందని, ఎంసిపిలు (మైక్రో క్రెడిట్ ప్లాన్) అందిన వెంటనే రుణాలను మంజూరు చేయాలని ఆదేశించారు.జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 27,910 ఎస్.హెచ్.జిలు ఉండగా 26,471 ఎస్‌హెచ్‌జిలకు రూ.977.74 కోట్ల రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు.వీటిలో కేవలం 2,668 ఎస్‌హెచ్‌జిలకు రూ.144.85 కోట్లు మాత్రమే మంజూరు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఆర్‌డిఎ ద్వారా పంపిన 9,633 ఎంసిపిలకు కూడా వెంటనే రుణాలను మంజూరు చేయాలని ఆదేశించారు. చేనేత కార్మికులకు ముద్ర లోన్స్ మంజూరులో తీవ్రజాప్యం ఎందుకని ప్రశ్నిం చారు. జిల్లాలో 253 మంది చేనేత కార్మికులకు రూ.1.11 కోట్లు మంజూరు చేయాలనేది లక్ష్యంగా కాగా కేవలం 13 దరఖాస్తులకు - తరువాయి 2లో..

## మాజీ సిఎం జగన్‌ను కలిసిన యువ నేతలు



**తాడేపల్లి,నరసాపురం,మేజర్‌న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని నర్సాపురం వైసిపి పార్టీ యువ నేతలు మంగళవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కొంతసేపు నరసాపురం రాజకీయాలు, ప్రస్తుత అభివృద్ధిపై జగన్ కు వివరించినట్లు 26వ వార్డు కౌన్సిలర్ జిల్లెల్ల దిలీప్ కుమార్ తెలిపారు. అధికార పార్టీ మన పార్టీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్నారని, ప్రజలంతా మన పక్షానే ఉన్నారు ధైర్యంగా ఉండండి జగన్ చెప్పినట్లు దిలీప్ తెలిపారు. వైసీపీ క్యాడర్ చెక్కు చెదరలేదని, అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ నిత్యం ప్రజల్లో ఉండి మన పాలనలో చేసిన అభివృద్ధిని, - తరువాయి 2లో..

## శాసనసభ గిరిజన సంక్షేమ కమిటీ మెంబర్‌గా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు





**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ గిరిజన సంక్షేమ కమిటీ మెంబర్‌గా పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు నియమితులయ్యారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం అభివృద్ధి కొరకు సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు. మిరియాల శిరీష దేవి శాసనసభ గిరిజన సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ కాగా ఆ కమిటీలో తాను ఒక మెంబర్‌గా ఎన్నికైనట్లు తెలిపారు. మొత్తం 12 మంది సభ్యులతో కూడిన కమిటీలో ప్రభుత్వం తనకు అవకాశం కల్పించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజనుల సంక్షేమం,అభివృద్ధికి కృషి చేసేందుకు తనకు అవకాశం కలిగిందని అన్నారు. ప్రభుత్వం తనకిచ్చిన ఈ బాధ్యతను సద్వినియోగం చేసుకొని గిరిజనుల అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు.రవికుమార్ శుభా కాంక్షలు..కాగా శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు - తరువాయి 2లో..

## అవినీతి చేస్తే ఎసిబికి పట్టిస్తా

ఎమ్మెల్యే అంజిబాబు హెచ్చరిక



**భీమవరం,మేజర్‌న్యూస్:** భీమవరం టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి విరుచుకుపడుతుందంటూ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అధికారులను గట్టిగా హెచ్చరించారు. పద్ధతి మార్చుకోండి, లేదంటే ఎసిబి చేతికి చిక్కుకోవాల్సిందే" అని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం భీమవరం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారి పార్ధసారధి, రెవెన్యూ అధికారి శ్రీనివాస్ రాజులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ప్రతి పనికి లంచాలు కోరుతున్నారనే పిర్యాదులు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉద్యోగాలు లంచాల కోసం చేసారా? బాధ్యతాయుతంగా పనిచేయండి.లేకుంటే ఇక్కడ మీకు చోటు ఉండదు.అవసరమైతే నేనే ఎసిబికి పట్టిస్తా అని హెచ్చరించారు. గతంలో నిజామాబాద్‌లో అవినీతి చేసిన ఏఈని నడిరోడ్డుపై స్థంబానికి కట్టేసిన ఘటనను గుర్తుచేసిన ఎమ్మెల్యే,అలాంటి పరిస్థితులు రాకుండా - తరువాయి 2లో..

# ఘనంగా భారతరత్న జే.ఆర్.డి టాటా జయంతి

## - ఎంబీఏ విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్న గారపాటి చౌదరి





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** కష్టపడి చదివిన విద్యార్థులే రేపు బంగారు భవిష్యత్తును నిర్మించగలరని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ వ్యాపారవేత్త గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు.భారతదేశపు ధార్మనిక పారిశ్రామికవేత్త, భారతరత్న జే.ఆర్.డి టాటా జయంతి పరిష్కరించుకొని ఏలూరు శ్రీరామ్ నగర్‌లోని తపన ఫౌండేషన్ కార్యాలయంవద్ద మంగళవారం సిఆర్ఆర్ కాలేజీ ఎంబీఏ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గారపాటి చౌదరి మాట్లాడుతూ యువతరం తాము ఎంచుకున్నరంగంలో వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ కష్టపడి, ఇష్టపడిపనిచేయాలన్నారు. ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను జోడించినప్పుడే జీవితంలో విజయాలను పొందే అవకాశం దక్కుతుందన్నారు. వ్యాపార రంగంలో ఎదిగేందుకు ఎంబీఏ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు గారపాటి చౌదరి సమాధానం ఇచ్చారు.తన జీవితంలో వ్యాపార రంగంలో ఎదుర్కొన్న ఒడిదిడుకులను విద్యార్థులకు వివరించారు. జె.ఆర్.డి టాటాను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు భవిష్యత్తులో మంచి వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, అందుకు ఇప్పటి నుండే ప్రణాళిక బద్ధంగా కష్టపడాలని విద్యార్థులకు గారపాటి చౌదరి సూచించారు.ఈకార్యక్రమంలో సిఆర్ఆర్ కాలేజీ ఎంబీఏహెచ్ఓడి డాక్టర్ కె.వి.శ్రీధర్,ఈవెంట్ కోఆర్డినేటర్స్ ఎన్.సతీష్,ఈ. కవిత,ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

# విజిలెన్స్,తూనికలు కొలతల అధికారుల దాడులు





**ఏలూరు,మేజర్‌న్యూస్:** రీజినల్ విజిలెన్స్ ,ఎన్ఫోర్స్మెంట్ అధికారి పి.మహేష్ ఆదేశాల మేరకు ఏలూరు పట్టణంలో విజిలెన్స్,తూనికలు కొలతల అధికారులు సంయుక్తంగా ఆటో మొబైల్ షాపులనందు తనిఖీ చేయగా ఏలూరు పట్టణంలో ఆటో స్పేర్ పార్టుల ఏజెన్సీ ఏలూరు నందు తయారి తేదీ, తయారిదారుని చిరునామా,గరిష్ట చిల్లర ధర,వినియోగదారు సేవ ఫోన్ నెంబర్ వంటి సమాచారం లేకుండా ఉన్నటువంటి వివిధ రకాల లైట్స్, హరన్స్, ఇంజన్ ఆయిల్స్ గుర్తించి సదరు షాపుపై తూనికలు కొలతలు చట్ట ప్రకారం మొత్తం 3 కేసులు నమోదు చేయడం జరిగింది.మేస్సేర్స్ సురేష్ కంప్యూటర్స్ షాపీ,ఏలూరు నందు తయారి తేదీ,తయారిదారుని చిరునామా, స్టికర్ అతికించిన గరిష్ట చిల్లర ధర,వినియోగదారు సేవ ఫోన్ నెంబర్ వంటి సమాచారం లేకుండా ఉన్నటువంటి కంప్యూటర్ ఉపకరణాలు గుర్తించి సదరు షాపుపై తూనికలు కొలతలు చట్ట ప్రకారం మొత్తం 2 కేసులు నమోదు చేయడం జరిగినది. ఈ తనికీల నందు విజిలెన్సు ఎస్ఐ కె.నాగరాజు , తూనికలు కొలతల అధికారి,ఏలూరు జి.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

# మాజీ సిఎం జగన్‌ను కలిసిన యువ నేతలు

మొదటిపేజి తరువాయి

ప్రస్తుత పరిపాలనను ప్రజలకు తెలియజేయాలని జగన్ సూచించినట్లు తెలిపారు. నర్సాపురంలో వైసిపి పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని, కీలకమైన పనులకు పెద్దఎత్తున నిధులు మంజూరుచేశానని,కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క అడుగు ముందుకు వెళ్లలేదని విషయం నాకు తెలుసు అని జగన్ అన్నట్టు దిలీప్ వివరించారు. ఏది ఏమైనా ఓపికగా ఉండి పార్టీని మరింత బలోపేతం చేయండి భవిష్యత్తు మనదే అని జగనన్నట్లు దిలీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు వైసిపి యువజన విభాగం అధ్యక్షులు వేగి బాబి, సోమరాజు భరత్, కోడెల్లి వెంకట్ రావు తదితరులు పాల్గొన్నారు.

# శాసనసభ గిరిజన సంక్షేమ కమిటీ మెంబర్‌గా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

మొదటిపేజి తరువాయి

శాసనసభ ఎస్టీ కమిటీ మెంబర్‌గా ఎన్నిక కావడంపై జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.అలాగే జనసైనికులు వీర మహిళలు స్థానిక ప్రజాప్రతి నిధులునియోజకవర్గ ప్రజలుఎమ్మెల్యేకుశుభాకాంక్షలు తెలిపారు.

# నిత్యావసర సరుకులు ధరలు నియంత్రణకు చర్యలు : జేసి





ఏలూరు,మేజర్‌న్యూస్ : నిత్యావసర సరుకులు ధరలు పెరగకుండా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి .ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో మంగళవారం జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కూరగాయలు, నిత్యావసర సరుకులు ధరలు పెరగకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. వ్యాపారాలు నిత్యావసర సరుకులను అక్రమంగా నిల్వలు చేసి, బహిరంగ మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి, ధరలు పెంచే అవకాశం ఉన్నందున,నిత్యావసర సరుకుల అక్రమ నిల్వలపై నిఘా పెట్టాలన్నారు.వ్యాపారులు పెద్దఎత్తున అక్రమ నిల్వలకు పాల్పడితే,గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో డిఎస్ఓ విలియమ్స్,ఉద్యానవనాలుశాఖ డిడి రామ్మోహన్, వ్యవసాయ, లీగల్ మెట్రోలజి, మార్కెటింగ్, తదితర శాఖలకు సంబంధించి అధికారులు,రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, హెూల్ సెల్ వర్తకులు, రైతులు పాల్గొన్నారు.

# డ్వాక్రా గ్రూప్‌లకు తక్కువ రుణాలు మంజూరుపై కలెక్టర్ ఆగ్రహం ..

మొదటిపేజి తరువాయి

రూ.8.35 లక్షలు మాత్రమే మంజూరు చేయడంపై ఆ సహనం వ్యక్తం చేశారు. వీవర్స్ ముద్ర కింద తీసుకున్న రుణాలపై సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేయాలని బ్యాంకర్లను కోరారు. కౌలు రైతులకు 1,05,500 సిసిఆర్‌సి కార్డులు జారీ లక్ష్యంకాగా 63,262 కార్డులు జారీ చేయడం జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఆగస్టు రెండున రైతులు ఖాతాలలో నగదు జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఈ లోపుగా ఎన్పీసీఐ ఇన్ ఆక్టివ్ ,మ్యాపింగ్ లేని 2,050 రైతుల ఎకౌంట్లను వెంటనే యాక్టివ్, మ్యాపింగ్ చేయాలని సూచించారు. లేనిపక్షంలో వారికి నగదు అకౌంట్లో జమ కాదన్నారు.బ్యాంకర్ల సమావేశానికి తప్పనిసరిగా బ్యాంకు కంట్రోలర్స్ మాత్రమే హాజరు కావాలని ఆదేశించారు. క్రిందిస్థాయి సిబ్బంది వస్తే నిర్ణయాలు ఎలా తీసుకోగలరని ప్రశ్నించారు.ఈసమావేశంలో యూనియన్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్‌ఎల్.వి.వి.ఆర్.కె.ఎం.ఎస్ మన్యం,నాబార్డ్ ప్రతినిధి నిష్యంత్ చంద్ర,లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్,,ఆర్బిఐ ప్రతినిధి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు,డిఆర్‌డిఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్,జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి అప్పారావు,వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల కంట్రోలర్, జూనియర్ ఆఫీసర్స్, కోఆర్డినేటర్స్, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి చేస్తే ఎసిబికి పట్టిస్తా

మొదటిపేజి తరువాయి

జాగ్రత్త పడండి. భీమవరంలో అధికారులందరినీ గౌరవంగా చూస్తున్నాం. కానీ భీమవరం అభివృద్ధి కోసం నిజాయితీగా పనిచేయాలి అని సూచించారు. సమీక్ష సమావేశంలో ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# చుక్కలనంటుతున్న సూపర్ సిక్స్ పథకాలు



**పోడూరు,మేజర్ న్యూస్ :** తూర్పుపాలెం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మాజీ మంత్రిచెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని పోడూరు మండలం పెనుమంట్ర మండలం కన్వీనర్లు పిల్లి నాగన్న గూడూరి దేవేంద్రుడు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కూటం ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ ఫిక్స్ హామీలలో కొన్ని హామీల నెరవేర్చారని, మిగిలిన హామీలు చుక్కలు నంటాయని ఎద్దేవా చేశారు. అధినాయకుడు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల ప్రకారం నియోజవర్గంలోని నాయకులు గడిచిన కాలంలో జిల్లా కార్యవర్గం సమీక్షించింది. ప్రస్తుతం నియోజకవర్గంలో నాయకులందరూ బాబు మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు అమలు విషయంలో మాజీ సిఎం జగన్ ఇచ్చిన మాజీ మంత్రి చెరుకూవాడ శ్రీ రంగనాథరాజు ఇచ్చిన పిలుపు మేరకు గ్రామాల్లో కూటమి ప్రభుత్వ పథకాలను ఎండగడుతూ ముందుకు వెళ్లాలని అన్నారు. మళ్లీ జగన్మోహన్ రెడ్డిని సీఎం చేయాలని కోరారు. రంగనాథరాజుని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని కార్యకర్తలు ధైర్య పడవద్దని నాయకులు మాట్లాడారు.ఈ కార్యక్రమానికి పోడూరు జడ్పిటిసి గుంటూరు పెద్దిరాజు ఎంపీపీ సబ్బిత సుమంగళి సాగర్ కర్రీ వెంకటనారాయణ రెడ్డి (వాసు) కర్రీ వేణుబాబు కొవ్వూరి బ్రహ్మేశ్వర్ రెడ్డి,పోతుమూడి రామచంద్రరావు గుబ్బల వీర బ్రహ్మం చింతపల్లి గురు ప్రసాద్ దొంగ దుర్గాప్రసాద్,బుర్ర రవికుమార్ కుచ్చర్లపాటి పద్మనాభ రాజు సువర్ణ రాజు గొట్టుముక్కల రమేష్ గుడాల చంటి గెద్దాడ ఏకలవ్య కర్రీ రామలింగారెడ్డి అల్లం భాస్కర్ రెడ్డి సత్తి విష్ణు కుమార్ రెడ్డి తాడిపత్తి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్,జె.ఆర్.డి. టాటాని ఆదర్శంగా తీసుకోవాలి





**ఏలూరు,మేజర్‌న్యూస్:**సర్‌సి.ఆర్.రెడ్డి కళాశాల సి.ఐ.ఐ.ఈ, ఈ.డి.సి, యం.బి.ఏ.యం.కాం. ఐ.క్యూ.ఎ.సి. వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆంధ్రా షుగర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ 104వ జయంతి,టాటా గ్రూపుల వ్యవస్థాపక అధ్యక్షులైన భారతరత్న జె.ఆర్.డి. టాటా 121వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత ఇద్దరు పారిశ్రామికవేత్తల చిత్ర పటాలకు ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త ద్వారకాతిరుమలలోని శ్రీ శ్రీనివాస మైన్స్ అండ్ మినరల్స్ చైర్మన్ మోగటదాకల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థిదశ నుండే మంచి నిర్ణయాత్మకమైన ఆలోచనతో, నిర్దేశించిన ప్రణాళికతో ముందుకు సాగాలని అప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించుకోగలుగుతారని అలాంటి వారిలో ముఖ్యులు మన ప్రముఖ పారిశ్రామికవేత్తలైన ఆంధ్ర షుగర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్,భారతరత్న జె.ఆర్.డి. టాటా ని మనం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ద్వారకా తిరుమలలో మొట్టమొదట మైనింగ్ వ్యాపారం మా నాన్న మొదలుపెట్టినప్పుడు రవాణా, బ్యాంకింగ్, మానవ వనరులు మొదలైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, కాని మీకు మీకు ఇప్పుడు అనేకమైన అవకాశాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలనుండి ప్రోత్సాహకాలు అందుతున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ యం.లక్ష్మీ రమణీ యం.బి.ఏ. విద్యార్థులు వివిధ అంశాలైన వ్యాపారలు, రైతులు, వినియోగదారులు ,సామాజిక, సాంఘిక అంశాలపై ఎదుర్కొంటున్న సమస్యలపై మినీ పరిశోధనలు చేసి కళాశాలకు సమర్పించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ఈకార్యక్రమంలోపి.జి.కళాశాల కరస్పాం డెంట్ కానాల శ్రీనివాస రావు,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఎ.రామ రాజు,పి.జి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.ఆర్.యస్. బాబు యలమర్తి, సి.ఐ.ఐ.ఇ ఈ.డి.సి.కో- ఆర్డినేటర్ డాక్టర్ తేర రాజేష్,యం.బి.ఎ. డైరెక్టర్ డాక్టర్ రంగు శ్రీనివాసరావు, ఐ.క్యూ.ఏ.సి. కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.రాము, యం.బి.ఏ.ఆచార్యులు డాక్టర్ వై.సౌజన్య,అధ్యాపకులు యం.ఉపేంద్ర, పి.హె.యన్.యస్.వి. సుబ్బారావు, యస్.శ్రీలత జి.వి.రవీంద్ర బాబు, వి.శ్రీనివాసరావు, పి.అపర్ణ ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వచ్చిన ముఖ్య అతిథులకు కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు.

# రైతులకు పంట నమోదు, జీవన ఎరువులపై అవగాహన



**కొయ్యలగూడెం రూరల్,మేజర్ న్యూస్ :** కొయ్యలగూడెం మండలంలోని రామానుజపురం, వేదాంతపురం గ్రామాల్లో రైతులతో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి కెఎస్‌వి పోసరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోసారావు మాట్లాడుతూ పంటలో,జీవన ఎరువులైన ఫాస్ఫో బ్యాక్టీరియా,కెఆర్‌బి వాడకం వల్ల పంటలకు నాణ్యమైన పోషకాలు అందుతాయని అన్నారు. రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా,నానో డిఎపిలను ఉపయోగించాలని రైతులకు సూచించారు. ఇవి వాడకంతో ఖర్చులను తగ్గించి, ఆదాయాన్ని పెంచుతాయని వివరించారు. పంటల బీమా పథకం గురించి వివరిస్తూ, వరికి ఎకరానికి రూ.850, మిను ములకు రూ.300 చెల్లించి బీమా చేయించుకోవాలని,జులై 31 ఆఖరి తేదీగా తెలిపారు. అలాగే, ఈ-పంట నమోదు తప్పనిసరని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాల కోసం ఇది కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి.బాలాజీ, వ్యవసాయ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# కిడ్నీ పేషెంట్‌కు ఇంటికి రేషన్ పంపిణీ



**పాలకోడేరు,మేజర్ న్యూస్:** 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు,దివ్యాంగులకు ఇంటికే వెళ్ళి రేషన్ అందివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలను రేషన్ డీలర్స్ సక్రమంగా నేరవేరుస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ రేషన్ అందించే ఉద్దేశంతో కోట్లాది రూపాయల ఖర్చుతో వాహనాలను సమకూర్చి,వాటి నిర్వహణకు మరిన్ని కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. అయినా వీధి చివరన వాహనాలను పెట్టి, ఎండా వానకు నిలువ నీడ లేకుండా రోడ్ పై వ్యాపారంగా మార్చేయడం తో ఆ పథకం విఫలమైంది. అయితే ప్రతిపక్షాల నుంచి ఎలాంటి విమర్శలు రాకుండా ముందే జాగ్రత్త పడి, వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ అందించాలని రేషన్ డీలర్లను ఆదేశించింది. ఇందుకోసం ఇప్పటివరకూ రేషన్ డీలర్స్‌కు ఎలాంటి వాహనాలను సమకూర్చలేదు. సరిగదా మూడు నెలలు అయినా డోర్ డెలివరీ నిమిత్తం రేషన్ డీలర్స్‌కు ఎలాంటి రెమ్యునరేషన్ ప్రకటించ లేదు.. దీనికి తోడు రేషన్ డీలర్స్ లోనే వృద్ధులు,మహిళలు, వికలాంగులు అయిన వారు రిజర్వేషన్స్ పరిధిలో నియమితులైన వారున్నారు. వారంతా భార్యల,భర్తల సాయంతో సహాయకులను నియమించుకు ని స్వంత ఖర్చులతో ఎన్నో కష్టాల నష్టాల కోర్చుకుని డోర్ డెలివరీ ని విజయవంతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గణపవరం గ్రామానికి చెందిన పెంటపాటి పార్వతి దుర్గ రెండు కిడ్నీలు పాడై పోయి, వైద్యం నిమిత్తం పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి పుట్టింటికి వచ్చి, డయాలసిస్ చేయించుకుంటున్నది. ఈ సమాచారం తెలుసుకున్న స్థానిక రేషన్ డీలర్ సోము సాయి కృష్ణ ఆమె ఇంటికి వెళ్లి థంబ్ వేయించుకుని, రేషన్ బియ్యం, పంచదార అందించారు. దాంతో ఆమె తల్లిదండ్రులు, చుట్టు పక్కల వారు డీలర్ ను అభినందిస్తున్నారు.

## కనిపించకుండా పోయిన బాలుడుని తిరిగి అప్పగించిన పోలీసులు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఇంటి నుండి బయటకు వెళ్ళి కనిపించకుండా పోయిన బాలుడుని ఏలూరు 2 టౌన్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్ వెంటనే స్పందించి ప్రకాశం జిల్లా గిద్దలూరులో ఉన్న సమాచారాన్ని తెలుసుకొని సదరు బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. 28వ తేదీ రాత్రి 7:30 గంటలకు,ఏలూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్‌కు దాసరి రోహన్ 13 సంవత్సరాలు తండ్రి సురేంద్ర బోరపు రెడ్డి వారి వీధి,చొడిదిబ్బకు చెందిన బాలుడు మిస్సింగ్ ఫిర్యాదు మేరకు ఏలూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు మూడు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. విచారణలో బాలుడు గిద్దలూరు ప్రాంతంలో ఉన్నట్టు సమాచారం అందడంతో జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్,డిఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాలపై ఏలూరు 2 టౌన్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్ పర్యవేక్షణలో, హెడ్ కానిస్టేబుల్ కె.సత్యనారాయణ తక్షణమే గిద్దలూరు వెళ్ళి బాలుడిని క్షేమంగా రికవరీ చేశారు. మంగళవారం బాలుడిని తల్లిదండ్రులకు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో అప్పగించారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు పోలీసు వారికి కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పిల్లలు కనిపించకపోతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదు చేయాలి. ఎటువంటి సమాచారం ఉన్నా డయల్ 112 నెంబర్‌కు కాల్ చేయండి సహాయం పొందాలని కోరారు.

## రుద్ర భూమిలో సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించిన వారిపై చర్యలు





**టి.నర్సాపురం,మేజర్ న్యూస్ :** మండలం మక్కినవారిగూడెం గ్రామంలో సర్వే నెంబర్271 లో1:95 సెంట్లు రుద్రభూమి ఉన్నదని, మక్కినవారిగూడెం పంచాయతీ పరిధిలో అక్రమంగా షెడ్డు నిర్మించారని దాని వెంటనే తొలగించాలని ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు టి.నర్సాపురం తాసిల్దార్ సాయిబాబాకు వినతిపత్రం అందజేశారు. వారి సామాజిక వర్గం వారికి సంబంధించిన అంత్యక్రియలు నిర్వహించాలంటే చాలా ఇబ్బందిగా ఉందని తెలియపరిచారు. షెడ్డుని వెంటనే తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మోదుగల్ల ముత్తయ్య,మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షులు తడకమళ్ళ ఆనందరావు,బొల్లా గంగాధర్ పాల్గొన్నారు.

### నవరసపురం,మాధవాయిపాలెంలలో పొలం పిలుస్తోంది



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** మండలంలోని నవరసపురం, మాధవాయిపాలెంలలో మంగళవారం పొలం తెలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అడబాల జ్యోషిల మాట్లాడుతూవరిలో యాజమాన్యం పద్ధతులు గురించి వివరించారు. రైతులందరూ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని కౌలు రైతులందరూ కౌలు కార్డులు తీసుకోవాలని తద్వారా ప్రభుత్వం వారు ఇచ్చే పథకాలకు అర్హులు కాగలరని అన్నారు.

అన్నదాత సుఖీభవ సంబంధించి బ్యాంక్ అకౌంట్ నకు ఎన్‌పిసిఐ యాక్టివేట్ చేయించుకోవా లన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద సొంత రైతులు లోను పొందని వారు రైతు సేవ కేంద్రం నందు గాని కామన్ సర్వీస్ సెంటర్ నందు గాని ఎకరాకు రూ.210 చొప్పున బీమా చేయించుకోవాలని, రైతు సోదరులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం ఇంచార్జి విజయ హన్న మేడిది ఏసు పాదం, లోకం జగన్నాథం, యుగంధర్ ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలి





**– ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్**

**చింతలపూడి,మేజర్‌న్యూస్ :** స్థానిక చింతలపూడి ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి చైర్మన్ హోదాలో పాల్గొన్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్.ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది.ముందుగా వైద్య సేవలు పొందుతున్న బాధితులను ఆసుపత్రి సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ఆసుపత్రిని అభివృద్ధి చేసేందుకు అందరూ కృషి చేయాలని అవసరం మేరకు కావలసిన సహకారం కూడా అందుతుందని అన్నారు.

– ఆసుపత్రికి వచ్చిన వారు సంతృప్తి చెందాలి –చుట్టుపక్కల దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో బడుగు బలహీన సామాన్య మధ్యతరగతి పేద ప్రజలు ఎక్కువగా పలు రకాల ఆరోగ్య సమస్యలతో వస్తుంటారని,వచ్చిన భాదితులు పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆసుపత్రిలోని వైద్యాధికారులు సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం నుంచి వెలువడే నిధులను ఏ మాత్రం వృధా కాకుండా దుర్వినియోగం చెయ్యకుండా ఉండాలన్నారు. అన్ని రకాల సదుపాయాలతో వైద్య పరీక్షలకు కావాల్సిన పరికరాలకు సంబంధించి నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని,అంతేకాకుండా అనారోగ్యంతో వచ్చిన పేషెంట్లకు డాక్టర్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ బాధితులకు భరోసాగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్నెంట్ తోపాటు కమిటీ సభ్యులు, కూటమి నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఈవిఎం గోడౌన్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా కేంద్రమైన ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోడౌన్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ వద్ద సిసి కెమేరాలతో చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం పరిశీలన రిజిస్టర్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖిలో భాగంగా ఈవిఎం గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవిఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు గౌడౌన్ క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామని తెలిపారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, ఇతర సిబ్బంది ఉన్నారు.

# ప్రతి ఒక్కరు అక్షర జ్ఞానం కలిగి ఉండాలి





**– సంబంధిత అధికారులు కృషి చేయాలి : జిల్లా కలెక్టర్**

**భీమవరం,మేజర్‌న్యూస్ :** వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో భీమవరం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవోస్,ఎంఈఓస్, ఏపీఎంస్, మున్సిపల్ కమిషనర్స్, సిటీ మిషన్ మేనేజర్స్, వయోజన విద్యా సూపర్వైజర్స్ కు నిర్వహించిన జిల్లా స్థాయి "అక్షర ఆంధ్ర" అక్షరాస్యత 2025–26పై శిక్షణా తరగతుల ప్రారంభ సభకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన ద్వారా జిల్లాలో 15–59 వయస్సు మధ్య కలిగిన 2,23,911 మంది నిరక్షరాస్యులను గుర్తించడం జరిగిందని, వీరిని మూడు భాగాలుగా విభజించి శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ సంవత్సరం తొలి విడతగా 69,392 మందికి ఆగస్టు నుండి ప్రారంభించి మార్చి వరకు అక్షరాస్యత తరగతులను నిర్వహించడం జరుగుతుంద న్నారు. సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఉదాసీనంగా తరగతులను నిర్వహించరాదని, దీని వెనుక ఎంతో లక్ష్యం ఉందన్నారు.మన రాష్ట్రవిద్యాశాఖ మంత్రి అక్షరాస్యత కార్యక్రమాన్ని ఒక లక్ష్యంతో ముందుకు తీసుకెళ్లేలా ఆదేశించడం జరిగిందన్నారు. అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న మన జిల్లాలో రెండు లక్షల పైబడి నిరక్షరాస్యులు ఉండడం ఒకసారి ఆలోచన చేయాలన్నారు. నిరక్షరా స్యలకు శిక్షణ తరగతులు అంటే ఒక సంతకం నేర్పి విడిచి పెట్టడం కాదని, వారికి రాయడం, చదవడం,ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతలపై పూర్తి పట్టు సాధించేలా నేర్పించాలన్నారు.

ఈ సందర్భంగా "అక్షర వెలుగు" సంక్షిప్త వాచకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ సి.హెచ్ ప్రభాకర్, డిఆర్‌డిఏపిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డ్వామా ఏపీడి జీవీకే మల్లికార్జునరావు, జిల్లా విద్యాశాఖ ఏడి ఎన్.సత్యనారాయణ,మెప్మా ఏవో హెప్సిబా,వైఎస్ను విద్య అసిస్టెంట్ ప్రాజెక్ట్‌ఆఫీసర్‌కెవివి సత్యనారాయణ ,ఎంపీడీవోస్, ఎంఈఓస్, ఏపీఎంస్, మున్సిపల్ కమిషనర్స్, సిటీ మిషన్ మేనేజర్స్, వయోజన విద్యా సూపర్వైజర్స్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ సాధించిన విద్యార్థులకు ఆర్థిక సహాయం



**నర్సాపురం,మేజర్‌న్యూస్:** స్థానిక శ్రీ వై యన్ డైమండ్ జూబ్లీ జూనియర్ కళాశాల పట్టణ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ వై ఎన్ డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అందే రామసతీష్ జన్మదిన వేడుకలను కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమం సందర్భంగా జూనియర్ కళాశాలలో చదువుతున్న ఐదుగురు ప్రతిభ గల విద్యార్థులు విష్ణు ప్రియ సీనియర్ బైపీసీ, యజ్ఞ దేవి ప్రసాద్ సీనియర్ ఎంపీసీ, కౌసల్య కుమారి సీనియర్ సిఈసి, సౌజన్య శివ భవాని జూనియర్ బైపీసీ, వేద శ్రీ సత్య జూనియర్ ఎంపీసీ చదువుతున్న వీరికి ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల చొప్పున డా.రామ సతీష్ అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రామ్ సతీష్ మాట్లాడుతూ 'నేనెప్పుడూ పుట్టినరోజు వేడుకలు జరుపుకోలేదని, ప్రతి సంవత్సరం నా పుట్టినరోజు సందర్భంగా ఎక్కడో ఒకచోట సంక్షేమ కార్యక్రమాన్ని చేస్తానని,ఈరోజు ఇలా విద్యార్థులకు చేయూతనివ్వడం సంతోషంగా ఉందని అన్నారు.అదేవిధంగా కళాశాల మొదటిసారిగా స్టడీ మెటీరియల్స్ ప్రింట్ చేయించి,అతి తక్కువ ధరకే విద్యార్థిని విద్యార్థులకు అందజేస్తున్నామని, ఈ సందర్భంగా ఎనిమిది మంది విద్యార్థిని విద్యార్థులకు జూనియర్ కళాశాల అధ్యాపక బృందం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందచేస్తున్నామని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అందే రామకృష్ణ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.చింతపల్లి కనకారావు, డీన్ ఆచార్య గంధం శ్రీ రామకృష్ణ,హెచ్ ఆర్ డి డైరెక్టర్ ఆచార్య చినమిల్లి శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ డి.చిట్టిబాబు,సెక్రటరీ ఆర్ భరణి, కోశాధికారి ఎస్ రమేష్, సీనియర్ లయన్స్ మెంబర్ రాజేంద్రప్రసాద్, రంగినీడి సుబ్బారావు, పొన్నాడ సుబ్రహ్మణ్యం, బాబురావు,ఆర్.కే.ఆర్.రాజు, జూనియర్ కళాశాల అధ్యాపక బృందంపాల్గొన్నారు.

## 21, 22వ డివిజన్‌కు జనసేన నూతన కమిటీలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు నగరంలోని 21వ, 22వ డివిజన్లకు మంగళవారం నూతన కమిటీలను పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ నియామకాలు ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు ఆదేశాల మేరకు చేపట్టినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. 21వ డివిజన్ కమిటీకి ఇల్లా శ్రీనివాస్ ను ఇన్చార్జిగా, నరహరి శెట్టి సోమేశ్వర రావును అధ్యక్షుడిగా, 22వ డివిజన్ కు కన్న వరప్రసాద్ ను డివిజన్ ఇంచార్జిగా, తాడికొండ శ్రీనివాస్ ను అధ్యక్షుడిగా నియమించారు. ఈ రెండు కమిటీల నియామకాన్ని పార్టీ ఏక గ్రీవంగా ప్రకటించగా, అనంతరం వీరంకి పండు అధ్యక్షతన జనసేన పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జనసేన సీనియర్ నాయకులు నారా శేషు, క్లస్టర్ ఇంచార్జీ పేటేటి రామ ప్రసాద్, జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, నాయకులు రెడ్డి గౌరీ శంకర్, సరిది రాజేష్, జనసేన రవి ,నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధించాలన్న లక్ష్యంతో కార్యాచరణ పై చర్చించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ "పార్టీ విజయానికి కార్యకర్తలే బలం. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలి. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతీ డివిజన్‌లో కమిటీలను ఏర్పాటు చేసి కార్యాచరణ అమలుకు సిద్ధం అవుతున్నాం" అని అన్నారు.

# ఐకమత్యంతోనే క్రైస్తవుల సమస్యల పరిష్కారం





**ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ సమావేశంలో మాజీ హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత**

**ఏలూరు, మేజర్‌న్యూస్ :** దళితులు, క్రైస్తవులు కలిసిమెలిసి ఐకమత్యంతో ముందుకు సాగాలని, అప్పుడే సమస్యలు పరిష్కార మవుతాయని రాష్ట్ర మాజీ హోం శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. మంగళ వారం ఏలూరు డిసిఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ ప్రారంభోత్సవ సమావేశం జాతీయ అధ్యక్షులు రెబ్బా ఇమ్మానియేల్, జాతీయ కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ పి.జీవన్ కుమార్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ తానేటి వనిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేవుడు ప్రసాదించిన ప్రేమ, కరుణ, నిన్ను వలే నీ పొరుగు వారిని ప్రేమించే మనస్తత్వం కలిగి ఉండాలని అన్నారు. మనస్తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. డాక్టర్ ప్రవీణ్ పగడాల మరణం ఎంతో బాధించిందని, ఆయన కుటుంబానికి ఆధ్యాత్మికంగా పాస్టర్లు,ప్రజలందరూ మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత హాస్టల్ పగడాల ప్రవీణ్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ కుమార్ మాట్లాడుతూ ఐకమత్యంతో ప్రతి ఒక్కరు జీవించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు పూర్తిస్థాయిలో పేద, బడుగు బలహీన వర్గాలకు, క్రైస్తవులకు, ముస్లింలకు అందడం లేదని పేర్కొన్నారు. పాస్టర్లు క్రీస్తు ప్రబోధించిన ప్రేమ కరుణ, సేవ గుణాలు కలిగి ఉండి సమాజ పరిరక్షణకు దోహదపడాలన్నారు. ఆర్.సి.యం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక అభివృద్ధి ఐక్యత సేవ ప్రేమ గుణాలతో ప్రతి ఒక్కరు జీవించాలన్నారు. పేదలకు సేవ ఆధ్యాత్మిక అభివృద్ధి లక్ష్యంగా సంఘాలు బలోపేతం కావాలని, నూతనంగా ఆవిర్భవించిన ఆల్ ఇండియా పాస్టర్ ఫెడరేషన్ సంస్థ కార్యక్రమాలను అభినందించారు.దేశంలోని 28 రాష్ట్రాల పరిధిలో పాస్టర్లు అంతా కలిసి ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ గా ఏర్పడినట్లు ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శిరెవరెండ్ పాస్టర్ జీవన్ కుమార్ అన్నారు. సమావేశంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర మాజీ అడిషనల్ డీజీపీ కే బాబురావు మాట్లాడుతూ ఉత్తర భారత దేశంలో క్రైస్తవులపై దాడులు, స్వేచ్ఛను అడ్డుకునే చట్టాలు, కొన్ని అరాచక శక్తులు క్రైస్తవులపై, పాస్టర్లపై అకారణ ంగా దాడులు చేస్తున్నారన్నారు. పాస్టర్లను జైలు పాలు చేస్తూ బెయిల్ రాకుండా చూస్తున్నారన్నారు. ఇటువంటి అరాచక చర్యలను క్రైస్తవులు ఐక్యంగా ఉండి ఎదుర్కోవాలని సూచించారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటూ, రాజ్యాంగ హక్కులనుహరించేశక్తులనుక్రైస్తవులు ముక్తకంఠం తో నిరసించాలని ఐక్యంగా ఉండి పోరాడాలని పేర్కొన్నారు. జాతీయ కార్యదర్శి డాక్టర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక అభివృద్ధి విస్తరింప చేయడం, క్రైస్తవులపై నివారణ, పేదల సేవ లక్ష్యంగా ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ కృషిచేస్తుందనిఅన్నారు జాతీయ అధ్యక్షులుగా రెవరెండ్ బిషప్ ఇమ్మానియేల్ జాతీయ సెక్రెటరీగా జీవన్ కుమార్ నియమితులయ్యారన్నారు.పాస్టర్లు జాతీయజెండాలుప్రదర్శిస్తూ మన మంతా భారతీయులమని అందరంఒకటే అనిచాటి చెప్పారు. అనంతరం మాజీ హోంమంత్రి,రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అతిథులు ఆల్ ఇండియా పాస్టర్ ఫెడరేషన్ లోగోను ఆవిష్కరిం చారు.నేషనల్ సెక్రటరీ డాక్టర్ జీవన్ కుమార్ వ్రాసిన ఆధ్యాత్మిక పుస్తకాన్ని మాజీ హోం మంత్రి డాక్టర్ వనిత రిటైర్డ్ అధికారులు, బిషప్ లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్యాముల్ ఆనంద్ కుమార్, ప్రముఖ న్యాయవాది జిరోనాల్డ్‌రాజు,ఆర్టీసీ రీజనల్‌చైర్మన్‌రెడ్డి అప్పల నాయుడు, బివి రాఘవయ్య చౌదరి, డిబిఆర్కే చౌదరి, పాస్టర్ సజీవరావు, విప్లవ రెడ్డి నవీన్ రెడ్డి దంపతులు, ఏలూరు మాజీ డిప్యూటీ మేయర్ సుధీర్ బాబు దంపతులు, రెవరెండ్ ఫాదర్ పి బాల, రెవరెండ్ ఫాదర్ ఐ మైఖల్,డాక్టర్ వైయస్ థామస్ రెడ్డి,బిషప్ కారుపాటి శాంతి సాగర్, వివిధ రాష్ట్రాల నుండి, వివిధ జిల్లాల నుండి వచ్చిన పాస్టర్లు పాల్గొన్నారు.

# స్మార్ట్ దోపిడీ కోసమే విద్యుత్ స్మార్ట్ మీటర్లు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు వన్ టౌన్ బిర్లాభవన్ సెంటర్ నుండి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టటం జరిగింది.. ఈ సంతకాల సేకరణ కార్యక్రమానికి ఐ.ఎఫ్.టి.యు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, సి.ఐ.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి ప్రసాదు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి భారతదేశ కార్పొరేట్ శక్తులుగా ఉన్న అదాని కంపెనీకి సేవకులుగా బాబు పని చేస్తున్నారు. ఆ నేపథ్యం ఏమిటంటే ఆంధ్రప్రదేశ్లో స్మార్ట్‌గా ప్రజల ఇండ్లలో స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టరు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలవద్ద డబ్బులను ఏ విధంగా దోచుకోవాలో,ఆడబ్బులు ఆదాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ధరణిలో బాబు సర్కార్ సర్ వేగంగా పనిచేస్తున్నదని అన్నారు. బాబు సర్కార్ ఈనాడు ప్రజలపై పెను భారం మోపుతూ స్మార్ట్ మీటర్లు బిగించడానికి బరితెగించిన బాబు సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమానికి సిద్ధం కావాలని నాయ కులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ఐ.ఎఫ్.టి.యు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రాశ్రీనివాసరావు,నాయకులు గడసాల రాంబాబు,ముంగం అప్పారావు,మీసాల రమణ, సూరి బాబు, కోరాడ అప్పారావు, మాజీ శ్రీను,దుర్గారావు, గోపి,ఆవాల అప్పారావు, ఎ.ఐ.టి.యు.సి నాయకులు ఉప్పులూరు హేమాశంకర్, సాయన్న అభిలాష్ కుమార్,గొర్లి స్వాతి, కొల్లూరి సుధా రాణి, ఉప్పులూరు లక్ష్మి, కొండేటి రాంబాబు, మహిళా సమైక్య ఏలూరు నగర అధ్యక్షురాలు కొం డేటి బేబీ, మరడాని సత్యవతి,బల్ల కనకదుర్గ రావు,సి.ఐ.టి.యు నాయకులు పంపన రవికుమార్, వైయస్ కనకారావు, మంచెల్ల ఇస్సాకు, ఐద్వా నాయకురాలు అరుణకుమారి,ఎస్.ఎఫ్.ఐ నాయ కులు జి కోటేశ్వరరావు,శివ,జస్వంత్ చేతివృత్తుదారులు కన్వీనర్ పిచ్చుకల ఆదిశేషు, పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన ఎంపీపీ గంజిమాల రామారావు



**కొయ్యలగూడెంరూరల్,మేజర్‌న్యూస్ :** తాడేపల్లి గూడెం గ్రామానికి చెందినటువంటి వ్యక్తి కోయిలగూడెం గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదానికి గుర య్యాడు. క్షతగాత్రులను ఎవరూ పట్టించుకోక పోవడంతో అటుగా ప్రయాణిస్తున్న గంజి మాలరామారావు క్షతగాత్రుడుని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రుడు కి తలకు బలమైన గాయం అవడంతో 108కి ఫోన్ చేయగా నెట్వర్క్ బిజీగా ఉండడంతో ఆయన వాహనంలో బాధితుడిని కోయిలగూడెం ప్రభుత్వాసుపత్రికి నేరుగా తీసుకొచ్చారు. వైద్యాధికారి పరీక్షించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్‌కి క్షతగాత్రులను తరలించారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న ప్రజలు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పూలపల్లి రవి, పులపాకుల దుర్గారావు, పలువురు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించమంటే గేటుకు తాళం వేస్తారా ?

- గౌతమి ఫ్యాక్టరీ కార్మికుల ఆగ్రహం
- ర్యాలీ,లేబర్ కార్యాలయం ముందు ధర్నా



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జీతాలుపెంచడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నాలుగు నెలలుగా శాంతియుత పద్ధతులలో ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడంతో సోమవారం వంగూరూ గౌతమీ ఫ్యాక్టరీ కార్మికులు ఐ.ఎఫ్.టి.యు. ఆధ్వర్యంలో గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీనతో కక్షగట్టిన యాజమాన్యం గేటుకు తాళం వేసింది. యాజమాన్యంఈ చర్యను వ్యతిరేకిస్తూ మంగళవారం కార్మికులు ఐ.ఎఫ్.టి.యు.ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నాలు నిర్వహించారు. స్థానిక కంద్రిక గూడెం సెంటర్ నుండి ప్రదర్శనగా బయలుదేరి అశోక్ నగర్ వంతెన మీదుగా లేబర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ గంట సేపు ధర్నా నిర్వహించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఏ.రాణికి వినతిపత్రం అందజేశారు. ఆమె స్పందించి,వెంటనే మేనేజ్మెంట్ తో ఫోన్లో సంప్రదించారు.వెంటనే గేటుకు తాళం తీసి కార్మికులందరికీ పనులు కల్పించాలనీ, కార్మిక సమస్యలను యాజమాన్యం- కార్మిక సంఘం చర్చించి పరిష్కరించుకోవాలనీ, లేదంటే చట్టప్రకారం తాము చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అనంతరం కార్మికులు ఊరేగింపుగా చాణక్యపురి కాలనీలోని పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయాలయానికి చేరుకుని, ధర్నా నిర్వహిం చారు.ఈ సందర్భంగా కార్మికుల నుద్దేశించి ఐ.ఎఫ్.టి.యు. రాష్ట్ర సహాయ కార్యదర్శి, గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు యు.వెంకటేశ్వరరావు (యు.వి),ఐ.ఎఫ్.టి.యు. జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, యూనియన్ ప్రెసిడెంట్ బెజవాడ పద్మావతి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.ఆలీసమ్మ, రంగమ్మ, రాణి, సత్యవతి, బేబీ,అనసూయ, సావిత్రి,లక్ష్మి, కృప,మోతీ భవానీ,లిల్లీ పుష్ప,రమణమ్మ, కోటేశ్వరరావు, శంకర్, సూరిబాబు తదితరులు నాయకత్వం వహించారు.

## 17 మోటార్ సైకిళ్లు స్వాధీనం : ఇద్దరు దొంగలు అరెస్టు





**ఏలూరు,మేజర్ న్యూస్ :** 17 బైకులను మోటార్ సైకిళ్లు దొంగతనం చేసిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. బైకులను స్వాధీనం చేసుకున్న ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ,భీమడోలు పోలీస్ స్టేషన్ అధికారులు ,ఏలూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ వి.కోటేశ్వరరావు,ఎస్ఐ రాంబాబు, సిబ్బంది నిర్వహించిన నిఘా చర్యల్లో ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి,14 మోటార్ సైకిళ్లు అందుబాటులో విలువ రూ.6,68వేలు స్వాధీనం చేసుకున్నారు. భీమడోలు సిఐ యుజె.విల్సన్ ఆధ్వర్యంలో, ద్వారకతిరుమల ఎస్ఐ పి.సుదీర్ బృందం 3 మోటార్ సైకిళ్లు విలువ రూ.1,40వేలు స్వాధీనం. మొత్తం 8,08,000 విలువైన 17 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.అరెస్ట్ అయిన ముద్దాయిల వివరాలు: సయాద్ రజాక్,గుడివాడ, కృష్ణా జిల్లా ,సయ్యద్ కరిముల్లా,గుడివాడ, కృష్ణా జిల్లా వీరిద్దరిపై క్రింది కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో ప్రావీణ్యత చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎన్ సూర్య చంద్రరావు ,ఏలూరు డిఎస్పి డి శ్రావణ్ కుమార్,ఏలూరు త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు,ఎస్సై రాంబాబు ,ఏలూరు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ,ఏలూరు వన్ టౌన్ ఎస్ఐ మదీనా భాష , ఏలూరు వన్ టౌన్ ఎస్ఐ నాగబాబు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదవాడిని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**– శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్**



**కైకలూరు,మేజర్ న్యూస్ :** గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్ కైకలూరు సీతారామ కళ్యాణ మండపం నందు సుపరిపాలనలో తొలి అడుగు స్వర్ణ ఆంధ్ర ఏ 2047 పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్ షిప్ పి4 సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతు ప్రతి పేదవాడిని ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. పేద వారందరికీ కూడు, గుడ్డ, నీడ అందించాలని కూటమి ప్రభుత్వం ఎజెండా అని దానికి మనం అందరం సమిష్టిగా కృషిచేయ్యాలని అన్నారు. అధికారులు, నాయకులు ప్రజా సమస్యలకు పరిష్కార దిశగా పనిచెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు, ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో చనిపోయిన రవీంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలి

**– ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** పామాయిల్ కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందనీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ విమర్శించారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఒక పత్రిక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ టీ.నర్సాపురం మండలం జెగ్గవరం గ్రామానికి చెందిన కొమ్ము ప్రభాకర్ కుమారుడు కొమ్ము రవీంద్ర విద్యుత్ షాక్‌తో చనిపోయారు. టీ.నర్సాపురం లో పామాయిల్ గెలలు నరుకుతుండగా కరెంట్ షాక్‌తో చనిపోవడం జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పునరావతం అవుతున్న అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే ఏలూరు జిల్లాలో పామాయిల్ కార్మికులు విద్యుత్ షాక్ తగిలి పిట్టల్లా రాలిపోతున్న అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. చనిపోయిన రవీంద్ర కుటుంబ నష్టపరిహారం ఫ్యాక్టరీ నుంచి పది లక్షల రూపాయలు, కరెంటు డిపార్ట్మెంట్ నుంచి పది లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో పామాయిల్ కార్మికులు కరెంటు షాక్ గురై చనిపోతున్న ప్రభుత్వం నుంచి ఫ్యాక్టరీ నుంచి గాని రావాల్సిన నష్టపరిహారం ఇవ్వటం లేదనీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు 25 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖ ద్వారా వారికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఫ్యాక్టరీ నుంచి 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# రుస్తుంబాదలో ట్రాక్టర్ బోల్తా -కూలీ మృతి




**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని రుస్తుంబాదలో మంగళవారం విషాద చోటు చేసుకుంది. పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి పొలంలో పనిచేస్తున్న రైతు కూలీ రావి రాజేశ్ (38) మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మద్దిపాటి



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కులు పంపిణీ పెదల పాలిట పెద్ద వరం అని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మంగళవారం ఉదయం తిమ్మాపురం గ్రామంలో 11 లక్షల 92 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కలను మండలంలోని పలు గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెంకటరాజు చేతుల మీదగా చెక్కులు అందజేశారు. ఈ క్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లంక సత్యనారాయణ, టిడిపి గ్రామ అధ్యక్షులు గంటా శ్రీనివాసరావు, పోలిన శ్రీనివాస్ రావు, ఏపూరి దాలయ్య, చిగురుపల్లి సామేలు,మటపర్తి రూపేష్ కుమార్,కోయ్యిలమూడి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు



**ద్వారకా తిరు మల, మేజర్ న్యూస్:** చిన్న వెంకన్న ఆల యానికి ఉపాలయమైన చెరువు వీధిలో కొలువై ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రీతికరమైన రోజు నాగ పంచమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, పూజలు నిర్వహించుకున్నారు. పూజారి రాము నాగ పంచమి పూజాఫలం గురించి భక్తులతో మాట్లాడుతూ నియమ నిష్టలతో నాగ పంచమ పూజ చేస్తే జాతకంలో ఉన్న నాగ దోషము తొలగిపోతుందని, పాములు వలన కలిగే భయం కూడా తొలగిపోతుందని విశ్వాసం.

నాగ పంచమి రోజున నాగదేవతను ఆరాధించడం వలన వైవాహిక జీవితంలో సమస్యలు, సంతానం కలవడంలో సమస్యల నుంచి ఉపశమనం పొందుతారని భక్తులకు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి కొన్ని తీర్ద ప్రసాదాలు స్వీకరించారు.

# పోలవరం కుడి కాలవలో మృత దేహం లభ్యం



**ద్వారకాతిరుమల, మేజర్‌న్యూస్:** పంగిడిగూడెం సమీపంలోని పోలవరం కుడి కాలువలో మృతదేహం లభ్యమైంది. మండలంలోని కొమ్మర గ్రామానికి చెందిన ప్రొద్దుటూరు శ్యామ్ (25) అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈనెల 27న ఇంటి నుండి బయలుదేరి వెళ్లి తిరిగి రాలేదు.

మంగళవారం ఉదయం పోలవరం కుడి కాలువలో శవమై తేలాడు. సమాచారం అందుకున్న భీమడోలు సీఐ యు.జె.విల్సన్, ఎస్సై సుధీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రామన్నపాలెం, కాళీపట్నంలలో సుపరిపాలన



**మొగల్తూరు, మేజర్ న్యూస్:** మండలంలోని రామన్నపాలెం, కాళీపట్నం తూర్పు గ్రామాల్లో సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి, "సుపరిపాలన తొలి అడుగు" యొక్క ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ప్రజల అభిప్రాయాలు, సమస్యలు స్వయంగా తెలుసుకుంటూ, మంచి పాలనకు టీడీపీ కట్టుబడిఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, బొల్లా నారాయణ విఠల్, జక్కంశెట్టి ఏడుకొండలు, జోగి రాధాకృష్ణన్, ఆకన సుబ్రమణ్యం,అడ్డాల బాబ్జీ , విప్పర్తి వెంకటేశ్వర్లు,నాగిడి రాంబాబు, పాల రాంబాబు, జక్కంశెట్టి చక్రపాణి, రేవు కృష్ణ, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యోగా ఆచార్య రంజిత్ గురూజీ దంపతులకు సన్మానం



**పెనుమంట్ర, మేజర్ న్యూస్ :** మార్టేరు ఖండవల్లి కిషోర్ చారిటబుల్ ట్రస్ట్ నందు జరుగుతున్న 9 రోజుల పాటు వ్యక్తిత్వ వికాసం, ధ్యాన యోగ శిక్షణలను అందించిన యోగా ఆచార్య రంజిత్ గురూజీ దంపతులను ట్రస్ట్ ఫౌండర్, ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి ఘనంగా సన్మానించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమం లో స్థానిక ప్రముఖులు కర్రి అత్యుతరామారెడ్డి, కర్రి కృష్ణా రెడ్డి, కర్రి వేణుబాబు, జెడ్పిటిసి కే.గౌరీ సుభాషిణి, మానవతా సభ్యులు, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, ఖండవల్లి కిషోర్ చారిటబుల్ సభ్యులు గుడిమెట్ల లక్ష్మణ రెడ్డి, రామారెడ్డి, సత్తిప%శీ%డు, మురళి తదితరులు మాట్లాడారు. ఈ తొమ్మిది రోజుల శిక్షణ నందు ప్రతి రోజు 50 మంది స్త్రీ, పురుషులు, 5 చిన్న పిల్లలు చాలా శ్రద్ధ గా గురూజీ చెప్పిన అన్ని విషయాలు తెలుసుకొని మంచి అమృత ఆహారాన్ని స్వీకరించమని ఇలాంటి క్యాంపు లు మరిన్ని కిషోర్ చారిటబుల్ ట్రస్ట్ నుండి చెయ్యాలని వక్తలు పేర్కొన్నారు.

# మాజీ ఎ.ఎం.సి. చైర్మన్ సానబోయిన గోపాల కృష్ణ మృతి

**అనారోగ్యంతో విశాఖపట్నంలో మృతి**



**పెనుమంట్ర, మేజర్ న్యూస్ :** మల్లిపూడికి చెందిన న్యాయవాది,మాజీ పెనుగొండ ఎ.ఎం.సి. చైర్మన్ సానబోయిన గోపాల కృష్ణ (60) మంగళవారం అనారోగ్యం వల్ల విశాఖపట్నంలో మృతి చెందారు. గతంలో ఆయన టీ.డీ.పీ. తరుపున ఎంపీటిసి గా, రాష్ట్ర బీసీ సంఘంలో పలు పదవులు నిర్వ హించారు. వీరి భార్య వీరలక్ష్మి స్థానిక మండలం లో ప్రభుత్వటీచర్. కుమారుడు, కుమార్తె ఉన్నారు. గోపాలకృష్ణ ఆకస్మిక మృతి పట్ల మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, మండలంలోని టీడీపీ నాయకులు వెలగలబుల్లి రామిరెడ్డి, జి.మురళీ,చింతపల్లి రామకృష్ణ, పలువురు కూటమి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఇక్కడ ఆయన అంత్య క్రియలు జరుగనున్నాయి.

# పరిశ్రమల స్థాపన వల్లనే ఆర్థిక ప్రగతి సాధ్యం





**- ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు పురోగతి సాధించాలి**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కల్పిస్తున్న అనేక ప్రోత్సహకాలు, రాయితీలపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల్లో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది. సమావేశంలో అజెండా అంశాలు, పెండింగ్ ధరఖాస్తుల పురోగతి, ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు అంశాలపై చర్చించారు.ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతి 15 రోజులకొకసారి డిఐపిసి సమావేశమై పరిశ్రమలకు సంబంధించిన అన్ని అనుమతులను సింగిల్ విండో పద్దతిలో తక్షణమే మంజూరు చేయడంతోపాటు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రాయితీలను మంజూరుచేయడం జరుగుతున్నదన్నారు.జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుకు సంబంధిత నియోజకవర్గ ప్రత్యేక అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఇప్పటికే చింతలపూడి నియోజకవర్గానికి సంబంధించి ఎంఎస్ఎంఇ పార్కును ఏర్పాటుచేసుకోవడం జరిగిందన్నారు.ఏలూరు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన కార్పెట్ రంగాన్ని మరింత విస్తరించేందుకు ఏర్పాటు చేసే క్లస్టర్ పనులను వేగవంతం చేయాలన్నారు.గిరిజన ప్రాంతంలో యువత ఏ ఉపాధియూనిట్లపై ఆసక్తి చూపుతున్నారో పరిశీలిస్తే వారికి అవసరమైన అవగాహన కల్పిచేందుకు ఓరియంటేషన్ టీమ్ లను పంపుతామని తెలిపారు. బ్లాక్ రైస్, రెడ్ రైస్ ప్యాకింగ్, వ్యవసాయ, ఉధ్యానవన అనుబంధ ఉపాధియూనిట్లు ఏర్పాటుకు చొరవ తీసుకోవాలన్నారు.

- 161 పరిశ్రమలకు అనుమతులు -జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ధరఖాస్తు చేసుకున్న 182 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సంబంధించి 161 ధరఖాస్తులకు సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేశామన్నారు. జిల్లాలో 7 పరిశ్రమల యూనిట్లకు వడ్డీ, సేల్స్ ట్యాక్స్ రాయితీలకింద రూ.35.06 లక్షలు రాయితీలుగా అందించేందుకు ఆమోదం తెలిపారన్నారు.అదే విధంగా 2 పరిశ్రమలకు పెట్టుబడి రాయితీ కింద రూ.89.33 లక్షలు అందించేందుకు ఆమోదం తెలపడం జరిగిందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి సుబ్రహమణ్యేశ్వరరావు, పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజరు కె.బాజ్జి, లీడ్ బ్యాంక్ మేనేజరు డి.నీలాద్రి, స్కిల్ డెవలప్ మెంట్ అదికారి ఎన్. జితేంద్ర, ఎఫ్ఎస్ఎంఇ స్టేట్ కన్వీనర్ వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నరు.

# సుపరిపాలనలో తొలి అడుగులో ఎమ్మెల్యే బడేటి చంటి



ఏలూరు,మేజర్ న్యూస్ : స్థానిక 31వ డివిజన్ పత్తేబాదలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఏడాదికాలంలో అమలు చేస్తూ వచ్చిన అభివృద్ధి, సంక్షేమాల మేళ్ళను ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే చంటి. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి భరోసా కల్పిస్తూనే, రానున్న కాలంలో మరింత లబ్దిని చేకూర్చిపెడతామంటూ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాధినేతలు ఏడాది కాలంలో అమలు చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే సంకల్పంతో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికీ వెళు_న్నామన్నారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ నాయుడు సోము,31వ డివిజన్ ఇంచార్జ్ పృధ్వి లక్ష్మి, కో ఇన్చార్జ ఐకా పరమేశ్వర్, , కో క్లస్టర్ ఇంచార్జ్ పోలినాటి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు నిర్మాణం చేయాలి




**- 4న గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల ఛలో కలెక్టరేట్**

**- ఆదుకోవాలంటూ భూ నిర్వాసిత రైతులు ధర్నా**

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయకపోతే పోరాటాన్ని ఉదృతం చేస్తామని, ఆగస్టు 4న గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని మానవతా కళ్యాణమండపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వామిశెట్టి హరిబాబు అధ్యక్షత వహించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఆగస్టు 4న గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల ఏలూరు చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టాలని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు,జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు వినతి పత్రాలు అందజేయాలని సదస్సులో తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు ప్రభుత్వాలు,అధికారులు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేరలేదని, రైతులను మోసగించారని తీవ్రంగా విమర్శించారు. చింతలపూడి,టి నర్సాపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి తదితర మండలాల్లో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ వలన తలెత్తున సమస్యలు అన్నింటిని పరిష్కారం చేయాలని లేనిపక్షంలో రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఈ సదస్సులో గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు వామిశెట్టి హరిబాబు, అల్లూరి రామకృష్ణ, దేవరపల్లి సత్య నారాయణ,శీలం రామచంద్రరావు,ఎలికే తాతారావు, వందనపు సాయి బాబా,కె.నాగేశ్వరావు, కె.రంగారావు,జి.నర్సిరెడ్డి, బొడ్డు రాంబాబు, పి.శ్రీహరి తదితరులు మాట్లాడారు.గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కారం కోరుతూ సదస్సుకు ముందుగా గురవాయిగూడెంలో రైతులు ధర్నా చేపట్టారు.

## రూ.7 లక్షలతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన : ఎంపీపీ రామారావు



**కొయ్యలగూడెం,మేజర్ న్యూస్ :** గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందించి అభివృద్ధి పథంలో ముందు ఉంచుతానని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,ఎంపీపీ గంజిమలా రామారావు అన్నారు. ఈ సందర్భంగా రామానుజాపురంలో మండల ప్రజా పరిషత్ నిధులు రూ.7 లక్షల వ్యయంతో శంకుస్థాపన కార్యక్రమాలను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ కడప నాగ లక్ష్మి మాట్లాడుతూ ఈ నిధులతో గ్రామంలోనే మౌలిక సదుపాయాలను ఏర్పాటుకు సిసి రోడ్లు ,డ్రైనేజీ వ్యవస్థ నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుంకర రాజేష్,గ్రామ అధ్యక్షుడు ధర్మరాజు,ఆరేడబ్ల్యూఎస్ మురళీకృష్ణ,ఎస్సీ సెల్ నాయకులు నూతంగి జాన్,స్థానిక నాయకులు పూలపాకుల దుర్గారావు, కొయ్యలగూడెం పంచాయతీ వార్డ్ సభ్యుడు పూలపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు తప్పకుండా పంట బీమా చేసుకోవాలి



**పెదవేగి,మేజర్ న్యూస్:** పెదవేగి మండలం పెదకడిమి గ్రామం,భోగాపురం గ్రామ పరిధిలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పెదకడిమి గ్రామ సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణ చౌదరి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ వరి పండిస్తున్న రైతులు తప్పకుండా పంట భీమ కట్టుకోవాల్సిందిగా సూచించడం జరిగింది. ఒక ఎకరాకు 840 ప్రీమియం చెల్లించవలసిందిగా రైతులకు తెలియ చేశారు. కౌలు వ్యవసాయం చేస్తున్న రైతులు అకాల వర్షాల వల్ల ఎటువంటి అవంత్రాల వల్ల పంట నష్టం కలిగినప్పుడు పంట బీమా రైతుకు తోడుగా ఉంటుందని ,కౌలు వ్యవసాయం చేస్తున్న రైతులు కౌలు కార్డులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి రత్నమాల, కొప్పాక సొసైటీ కార్యదర్శి రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 4న జిల్లా కేంద్రాలలో జర్నలిస్టల డిమాండ్స్ డే

**- ఏపీ డబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు**

**ఏలూరు, మేజర్ న్యూస్ :** జర్నలిస్టల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తేవడం కోసం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టల సమాఖ్య( ఏపీ డబ్ల్యూ జె ఎఫ్) ఆధ్వర్యంలో ఆగస్టు 4 జర్నలిస్టుల డిమాండ్స్ డే నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చిందని రాష్ట్ర కార్యదర్శి కె ఎస్ శంకర రావు,ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్సులు ఎస్ డి జబీర్,హరీష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక సంయుక్త ప్రకటన లో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ ఫెడరేషన్ ఆధ్వర్యంలోజూన్ 11డిమాండ్స్ డే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని,దీన్ని కూడా విజయవంతం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.మంత్రివర్గ ఉప సంఘం ఆగస్టు 6వ తేదీన సమావేశమై జర్నలిస్టుల సమస్యల పరిష్కారం గురించి చర్చించబోతోందని, జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్య, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, అక్రిడిటేషన్ల జీవో జారీ తదితర అంశాలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు.


# బీ- రెడీ పేరుతో అంతర్జాతీయంగా కొత్త ప్రాజెక్ట్ అమలు

**– ఎంపీ పుట్టా మహేష్‌కు సమాధానం ఇచ్చిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద్**



**దిల్లీ/ఏలూరు,మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంతాలు,అభివృద్ధి చెందని ప్రాంతాల్లో వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు ,రాష్ట్రాల వారీగా అమలు స్థితి గురించి పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్య ,పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ మంగళవారం లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. భారత ప్రభుత్వం 2014 నుండి వ్యాపార సౌలభ్య వాతా వరణాన్ని మెరుగుపరచడంలో చురుకుగా నిమగ్నమై ఉందని,ఇందుకు వ్యాపార సంస్కరణ కార్యాచరణ ప్రణాళిక, జన్ విశ్వాస్ చట్టం, కంప్లైయన్స్ తగ్గింపు కార్యక్రమాలు, సింగిల్ విండో సిస్టమ్‌లు, తదితర చర్యలు చేపట్టినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.ంద్ర ప్రభుత్వం 2014 నుంచి వివిధ రాష్ట్రాలతో కలిసి బి.ఆర్.ఎ.పి, ఆర్.సి.బి, ఎన్.ఎస్. డబ్ల్యు.ఎస్, వంటిసంస్కరణలతో కూడిన కార్యా చరణ చేపట్టిందని, వ్యాపార పరంగా షరతులను 45,000కి పైగా తగ్గించబడ్డాయని కేంద్ర మంత్రి తెలిపారు.వాటిలో 15,898 సరళీకరణ, 22,264 డిజిటలైజేషన్, 4,023 డీక్రిమిన లైజేషన్,2,909 తొలగింపు చర్యలు తీసుకున్నామని, మొత్తం 30 రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాలు సింగిల్ విండో సిస్టమ్ చేస్తున్నాయని, ఆంధ్రప్రదేశ్ ఎన్.ఎస్.డబ్ల్యు.ఎస్ ఫార్వర్డ్, రివర్స్ ఇంటిగ్రేషన్ పూర్తి చేసిన మొదటి రాష్ట్రాల్లో ఒకటిగా ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

# పెనుగొండ పీఏసీఎస్ అభివృద్ధికి కృషి : చైర్మన్ వేద వ్యాస శాస్త్రి



**పెనుగొండ, మేజర్ న్యూస్ :** పెనుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని (పీఏసీఎస్) మంగళవారం త్రీ మెన్ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు పితాని సత్యనారాయణ పాల్గొన్నారు, పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం అధికారి అసిస్టెంట్ రిజిస్టర్ సెక్రటరీ సూర్నీడి శ్రీ రంగ సాయి పవన్ కుమార్ సమక్షంలో సొసైటీ చైర్మన్ గా నక్క వేద వ్యాసం శాస్త్రి ప్రమాణ స్వీకారం చేశారు, డైరెక్టర్ గా వెంద్ర మురళి, కానూరి వెంకట సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు, ఈ కార్యక్రమంలో పితాని సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ వారి అవసరాల తగ్గట్టుగా నడుచుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా అభివృద్ధి పథంలో నడుస్తుందని.నూతనంగా ఎన్నికైన చైర్మన్ నక్క వ్యాస శాస్త్రి వేంద్ర మురళి కానూరు వెంకట సత్యనారాయణకు ఇంకా వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధి పథంలో నడపాలని రైతులను సంఘంలో చేర్చుకుంటూ వారికి ఎటువంటి కష్టం వచ్చినా సకాలంలో సమస్యను తీర్చాలని అన్నారు. అలాగే ఎన్నికైన వారిని పితాని సత్యనారాయణ అభినందించారు నక్క వేద వ్యాస శాస్త్రి మాట్లాడుతూ పెనుగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని (పీఏసీఎస్) జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. మరింత మంది రైతులను చేర్చి వారికి మెరుగైన సేవలను అందించేందుకు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సహకారం తీసుకుంటానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ గ్రామ సర్పంచ్ నక్క శ్యామల సోని సీనియర్ టిడిపి నాయకులు జనసేన నాయకులు వీర మహిళలు బిజెపి నాయకులు రైతులు ప్రజలు పాల్గొన్నారు.

# పోలవరం ఆర్‌అండ్‌ఆర్ భూ సేకరణ పనులు పూర్తి చేయాలి





**– ఆయా ప్రాంతాలాలో గ్రామ సభలు నిర్వహించాలి : జిల్లా కలెక్టర్**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేటు గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ పనులకు సంబంధించి భూ సేకరణపై జిల్లా జాయింటు కలెక్టరు పి.ధాత్రిరెడ్డి, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఐటిడిఏ అపూర్వ భరత్, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి తమ భూములు అందించిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజిలో భాగంగా భూమికి భూమి, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల నిర్మాణం,తదితర పనులకు గాను జిల్లాలో ఇంకా 5 వేలు ఎకరాలు భూమి అవసరం కాగా ఇప్పటికే బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాలు 800 ఎకరాలను గుర్తించడం జరిగిందని అన్నారు.మిగతా 4,200 ఎకరాలు వారానికి 500 ఎకరాలు చొప్పున ఆగస్టు15 వ తేదీ నాటికి పూర్తి చెయ్యాలని ఆదేశించారు.ఈ భూములు పూర్తిగా గిరిజనేతర భూములు మాత్రమే గుర్తించాలని, గిరిజనులు, ఇతరులు గాని ఏటువంటి ఆక్రమణలు ఉండకూడదని స్పష్టం చేశారు.భూసేకరణ కోసం భూమిని గుర్తించిన తర్వాత ఆయా గ్రామాలలో గ్రామసభలు నిర్వహించాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. భూములు గుర్తించిన తర్వాత ఆయా రైతులతో ఆర్డీవో, డిఎస్పి అధికారులు చర్చించి వారి సమక్షంలో గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు.

భూములకు పరిహారాన్ని ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రైతులకు చెల్లించటానికి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. భూ సేకరణ స్నేహపూరిత వాతావరణంలో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా అధికార యంత్రాంగం వ్యవహరించాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సూచించారు.ఈ సమావేశంలో స్పెషల్ కలెక్టరు యస్.సరళ వందనం,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు,తహాశీల్దార్లు, డిప్యూటీ తహాశీల్దార్లు,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి దొంగతనాల కేసులో ముద్దాయిల అరెస్టు

**– రూ.11.5 లక్షల బంగారు ఆభరణాల స్వాధీనం**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు పట్టణ పరిధిలో రాత్రి పూట జరుగుతున్న ఇంటి దొంగతనాల నేపథ్యంలో, ఏలూరు 1 టౌన్ ఇన్స్పెక్టర్ జి. సత్యనారాయణ నేతృత్వంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. కైకలూరు మినీ బైపాస్ వద్ద అనుమానా స్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారి ంచాగా రికవరీ వివరాలు మొత్తం 125 గ్రాములు, రు.11, 50వేలు హారం, చంద్రహారం, మురుగులు, ఉంగరాలు, చెవి మాటీలు, నవరత్నాల దిద్దులు, బేబీ రింగ్ లు.అరెస్టు చేశారు, నిందితులు పిల్లి సురేష్,శివ తెనాలి, గుంటూరు జిల్లా,నాగళ్ల ముతయ్య గుప్తా పాలకొల్లు, పశ్చిమ గోదావరి,నిందితులపై పలు పోలీస్ స్టేషన్లలో దొంగతన కేసులు ఉన్నాయి. మొగల్తూరు పిఎస్‌లో కొట్లాట, మోసం కేసులు.ఇన్స్పెక్టర్ జి.సత్యనారాయణ సబ్ ఇన్స్పెక్టర్లు ఎస్‌కె.ఎం.బాషా, బి.నాగబాబు వన్ టౌన్ సిబ్బంది ఎఎస్ఐ అహ్మద్, హెచ్‌సి రమేష్, పిసిఎస్ మోహన్, నాగార్జున, నాగరాజు, శేషుకుమార్, రుహుల్ల సిసిఎస్ సిబ్బంది ఎఎస్ఐ గోపి, హెచ్‌సి రమణ,పిసి రజని పాల్గొన్నారు.

## విద్యార్థులు జీవితాలను పాడు చేసుకోవద్దు

**– రూరల్ సీఐ రవికుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు**



**కలిదిండి / కైకలూరు,మేజర్ న్యూస్,** కలిదిండి అరుణ డిగ్రీ కాలేజ్ నందు కైకలూరు రూరల్ సీఐ వి రవికుమార్ విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో, సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించి, డ్రగ్స్ వలన విద్యార్థులు తమ జీవితాలను పాడు చేసుకోవద్దని, డ్రగ్స్ వాడుకోవడం వల్ల విద్యార్థి దశలో అనేక దుష్పరిణామాలు ఉంటాయని, అందువలన జీవితాన్ని పాడు చేసుకోవద్దని, సైబర్ క్రైమ్ తెలియని నెంబర్ నుంచి మెసేజ్లు వచ్చిన ఏపీకె అలాంటి ఫైల్స్ ఓపెన్ చేసిన మన అకౌంట్ లో ఉన్న డబ్బులు మొత్తం మాయమైపోతాయని దీని గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలని, వారికి తెలియజేస్తూ విద్యార్థులు అందరితోనూ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు ఆన్లైన్లో మోసాలు జరిగినట్లయితే సైబర్ క్రైమ్ డయల్ ఫ్రీ నెంబర్ 1930, అలాగే డ్రగ్స్ గురించిన డయల్ ఫ్రీ నెంబర్ 1972, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 112, నంబర్లకు ఫోన్ చేసి తమ చుట్టుపక్కల జరిగే సమాచారాన్ని ఈ నెంబర్ల ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని చెప్పి ఉన్నారు.ఈ కార్యక్రమంలో కలిదిండి ఎస్ఐ వి వెంకటేశ్వరరావు,కాలేజీ ప్రిన్సిపాల్ సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా వీరా సురేష్



**ఏలూరు,మేజర్ న్యూస్:** మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా ఎం.వీరా సురేష్ ను నియమిస్తూ నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు,కమిషనర్ ఏ.భాను ప్రతాప్ ఉత్తర్వులు అందించారు. ఇప్పటివరకు ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్న అంబుల వెంకటనారాయణ పబ్లిక్ ప్రాసిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులు కావడంతో ఖాళీ అయిన స్థానంలో ఎం.విసురేష్‌ను నియమించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్ ప్రాసిక్యూటర్ ఏవి నారాయణ,అడ్వకేట్ కెల్లా వెంకట కన్నారావు,మాజీ కార్పొరేటర్ మారం హనుమంతరావు,అందే జగదీష్ తదితరులు ఉన్నారు.